క్లుప్తంగా

అనాథ శవానికి అంత్యక్రియలు



వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత తదితరులు

అల్లిపురం: నెలరోజుల క్రితం పుట్‌పాత్ మీద నిస్సహాయ స్థితిలో కనిపించిన వృద్ధుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆశ్రయం కల్పించారు. అంతే కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి కేజీహెచ్‌లో వైద్యం కూడా చేయించారు. అతను కోలుకోవడంతో డిశ్చార్జి చేయించి ఐదు రోజుల క్రితం షెల్టర్ కి తీసుకొచ్చారు. అయితే గురువారం నుంచి అతని ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో గోపాలపట్నం ఆస్పత్రికి తీసుకెళ్లారు. దారిలో అతను మరణించాడు. దీంతో విషయాన్ని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు తెలియజేసి ఆ అనాథ శవానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించినట్లు మమత తెలిపారు.

ముస్లింల శాంతి ర్యాలీ



అల్లిపురం మసీదు వద్ద నుంచి బయలుదేరిన శాంతి ర్యాలీ

అల్లిపురం: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం యాతపేట మసీదు వద్ద మహ్మద్ ప్రవక్త జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు వద్ద నుంచి ప్రవక్త ప్రవచనాలతో కూడిన నినాదాలతో ముస్లింలు ఈద్మిలాదినబీజు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అల్లిపురం యాతపేట మసీదు నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ మీదుగా, సరస్వతీ పార్కు, జగదాంబ మీదుగా పాతపోస్టాఫీసుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో చిన్నారులతో సహా అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

భూదాత.. సంఘ సేవకుడు కేశనపల్లికి ఘన నివాళి



అన్నదానం చేస్తున్న శ్రీవత్సవ్, కన్నబాబు కుమారులు

డాబాగార్డెన్స్: భూదాత, ప్రముఖ సంఘ సేవకుడు కేశనపల్లి నరసింహారావు (కన్నబాబు) సంతాప సభ శుక్రవారం పాతనగరం స్వామి వివేకానంద సంస్థ వద్ద నిర్వహించారు. కన్నబాబు కుమారులు, మనవడితో పాటు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని కన్నబాబు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనను ప్రారంభించి శ్రీవత్సవ్ మాట్లాడారు. తాతయ్య ద్రోణంరాజు సత్యనారాయణ, తండ్రి శ్రీనివాసరావుతో కన్నబాబుకి చక్కటి అనుబంధం ఉందని, ఎంతో మంది నిరుపేదలకు భూమిని దానం చేసి, భూదాతగా కీర్తి గడించారని తెలిపారు. అందరూ ఎన్నో దానాలు చేయొచ్చు కానీ భూమిని దానం చేయడం ఒక్క కన్నబాబుకే సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యుడు సోంబాబు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మిని దర్శించుకున్న దేవదాయ శాఖ కమిషనర్



సతీసమేతంగా అమ్మవారికి పూజలు చేస్తున్న కమిషనర్ రామచంద్రమోహన్

డాబాగార్డెన్స్: దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ కనకమహాలక్ష్మి అమ్మవారిని శుక్రవారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వారిచే అమ్మవారికి పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



37వ వార్డు రెల్లివీధి జంక్షన్ వద్ద రాళ్లు తేలిన రోడ్డు



ఎల్ఐసీ వెనుక రోడ్డులో పని పూర్తయి నాలుగు నెలలు గడిచినా తొలగించని మట్టి కుప్పలు

మార్గం.. అగమ్యం

- దక్షిణలో శిథిలమైన పలు రహదారులు
- ప్రమాదకరంగా అల్లిపురం, బౌడారా రోడ్డు, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, టౌన్ కొత్తరోడ్డు తదితర ప్రాంతాలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు.. అధికారులు



జడ్జికోర్టు.. సీఎంఆర్ రోడ్డు మధ్యలో గొయ్యి

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పధ్నాలుగు నెలలు కావచ్చింది. ప్రజల కనీస సదుపాయమైన రహదారుల నిర్వహణలో పూర్తిగా విఫలమై ప్రజల నుండి విమర్శలు ఎదుర్కొంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదారు నెలల తర్వాత ప్యాచ్ వర్క్‌లు చేసి మమా అనిపించేశారు. మరో ఐదారు నెలల తర్వాత కూడా ప్యాచ్ వర్క్స్ చేశారు. ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గోతులతో నెలల తరబడి వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిన్నచిన్న గోతులను జూమ్ చేసి భూతద్దంలో చూపించి రహదారుల నిర్వహణపై దుష్ప్రచారం చేశారు. వారు అధికారంలోకి వచ్చాక రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. రహదారుల నిర్వహణ, మరమ్మతుల విషయం మొక్కుబడి తంతుగా మారింది.

వలు ప్రాంతాల రోడ్లు శిథిలం..

నియోజకవర్గ పరిధి అల్లిపురం, బౌడారా రోడ్డు, రెల్లివీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డు, టౌన్ కొత్త రోడ్డు, రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డు, పోలీస్ క్లబ్ ప్రాంతం, నౌరోజీరోడ్డు, ఎల్ఐసీ వెనుక రోడ్డు, డాబాగార్డెన్స్ ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం రోడ్డు, జడ్జికోర్టు–సీఎంఆర్ షాపింగ్ మాల్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్ల మధ్యలో ఉన్న గోతులతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లలో ఏర్పడిన గోతులను పూడ్చి మార్గం సుగమం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



డాబాగార్డెన్స్ జనప్రియ ఫుట్‌వేర్ ప్రాంతం రోడ్డు మధ్య భాగం శిథిలమైన దృశ్యం



29వ వార్డు కృష్ణానగర్ వద్ద రోడ్డు పరిస్థితి ఇలా..

వంచనే బాబు నైజం



కొల్లివారి వీధిలో ప్రచారం చేస్తున్న రమేష్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బంగారుమెట్ట కొల్లి వారి వీధి 63వ బూత్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో గడపగడపలో ప్రచారం చేశారు. మోసపూరిత హామీలతో ప్రజల్ని మోసం చేస్తున్న చంద్రబాబు విధానం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పచ్చిరిపల్లి రాము, శ్రీ వెంకటేశ్వర ఆలయం మాజీ చైర్మన్ ఆర్. వెంకట మహేష్, హేమలక్ష్మి, కొల్లి సత్యవతి, బూరల చిన్న, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బాడుగుల శ్రీనివాసరావు, జీవీఎస్ రెడ్డి, వార్డు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



పండా వీధిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

జగదాంబ: అన్నదానం పుణ్యకార్యమని వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని వెలంపేట పండావీధిలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కనకరెడ్డి మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గనిర్దేశకులు



సిస్టర్‌ను సత్కరిస్తున్న కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్



ప్రభుత్వ మహిళా కళాశాల పూర్వ అధ్యాపకులతో ప్రస్తుత అధ్యాపకులు, ప్రిన్సిపాల్ మంజుల

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధిలో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలల్లో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. సోఫియా జూనియర్ కళాశాలలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని హెచ్‌ఎం రెవరెండ్ ఫాదర్ విజయ్‌భాస్కర్, ఫాదర్ నాయుడు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులని, దైవంతో సమానం అన్నారు. సిస్టర్ ఫ్రాన్సికా, సిస్టర్ మేరీ హెలీనా, సిస్టర్ నిర్మల జ్యోతిలను సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతే ఉపాధ్యాయుల ధ్యేయం..

అల్లిపురం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అల్లిపురంలోని ఎంజీఎం హైస్కూల్, రైల్వే క్వార్టర్స్ ప్రభుత్వ హైస్కూల్, మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఎంజీఎం హైస్కూల్‌లో..

డాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతే ఉపాధ్యాయుల ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో పాటు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎం.రాధారాణిలను సత్కరించారు.

మోడల్ స్కూల్‌లో..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల జీవీఎంసీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఆనంద్‌తో పాటు ఉపాధ్యాయులు ఆదిబాబు, రామారావు, గౌరీశంకర్, కల్పనాకుమారి, సురేష్‌కుమార్ తదితరులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం శుక్రవారం వేడుకగా సాగింది. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే కర్తవ్యాన్ని అత్యంత బాధ్యతతో నిర్వర్తించే వారు గురువులని, వారి పట్ల కృతజ్ఞతా భావం వ్యక్తం చేయడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రస్తుత తరం విద్యార్థులకు పూర్వ అధ్యాపకుల అనుభవాలు అవసరం కాబట్టి గతంలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు సేవలందించి, పదవీ విరమణ చేసిన అధ్యాపకులను ఆహ్వానించి సత్కరించారు. పూర్వ అధ్యాపకులు రామానుజమ్మ, డాక్టర్ ఆశారాణి మాట్లాడుతూ ఈ విద్యా సంస్థలో పని చేయడం తమ జీవితంలో ఓ గొప్ప అనుభవమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సంతోషి అనూష, డాక్టర్ సీఎల్ శరణ్య, డాక్టర్ నివేదిత, డాక్టర్ కిరణ్మయి తదితర అధ్యాపక బృందం పాల్గొంది. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు



ఉత్తమ టీచర్ అవార్డుతో అనిత

అనితకు ఉత్తమ టీచర్ అవార్డు..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురానికి చెందిన ఐ.అనిత ఉపాధ్యాయినిగా అనకాపల్లి జిల్లాలో పని చేస్తున్నారు. శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆమె కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు చేతుల మీదుగా ఉత్తమ టీచర్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు జ్ఞానాపురం ప్రజలు, బంధుమిత్రులు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

గురువులు సామాజిక స్పృహ పెంపొందించుకోవాలి..



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: ఉపాధ్యాయులు సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే బాధ్యతను, సామాజిక స్పృహను కలిగి ఉండాలని ఏయూ ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం, బీఎస్ఆర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుస్తకాలు చదివించడం మాత్రమే చదువు కాదని, ఉన్నత జీవన విధానం నేర్పించాలన్నారు. విద్య అందరికీ చేరువ చేయడంలో ఫౌండేషన్, ట్రస్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అనంతరం సేవా దృక్పథంతో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు, డాక్టర్ జి.ప్రియాంక, బుజ్జి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రఘుపతి, గాంధీ పాల్గొన్నారు.

పేదవాడికి వైద్యం ఉచితంగా అందాలి

వైద్యుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్



డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: పేదవాడికి వైద్యం ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వానికి తగదని ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పేర్కొన్నారు. ప్రజారోగ్యం, వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పజెప్పేందుకు తీసుకున్న నిర్ణయాన్ని జహీర్ అహ్మద్ తప్పుబట్టారు. ఈ విషయమై సాక్షితో మాట్లాడారు. దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న 10 కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి ఏపీ క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైద్య కళాశాలల్ని అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. ఏ ప్రభుత్వమైనా పోరాడి మరీ మెడికల్ కాలేజీలను సాధించుకుంటుంది. అలాంటిది అన్ని హంగులతో సిద్ధమైన వాటిని చంద్రబాబు సర్కార్ ప్రైవేట్ పరం చేస్తుండడంపై ఆయన మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషితో సాకారమైన మెడికల్ కాలేజీలను కక్షపూరితంగా అడ్డుకుని పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయడం దారుణమన్నారు. కూటమి సర్కార్ అనాలోచిత చర్యలతో మన రాష్ట్రం మెడికల్ సీట్లను కోల్పోవడంతో పాటు నాణ్యమైన వైద్యం పేదలకు దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో 37 మెడికల్ కళాశాలలున్నాయని, వీటిలో 18 ప్రభుత్వ, 19 ప్రైవేట్ కళాశాలలున్నాయని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు ప్రతిపాదించిందని, వీటిలో ఐదేళ్లలోనే ఐదు కళాశాలలు ఏర్పాటయ్యాయని చెప్పారు. ఇది చాలా గొప్ప విషయమన్నారు. ఫలితంగా సుమారుగా 750 ప్రభుత్వ సీట్లు సమకూరినట్టయిందన్నారు. ప్రభుత్వ కళాశాలలో పేదలు చదువుకోవాలన్న మంచి ఉద్దేశంతో రూ.8643 కోట్లతో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కళాశాలలు అప్పజెప్పేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జహీర్ అహ్మద్ డిమాండ్ చేశారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పవిత్రాలు తీసుకొస్తున్న ఈవో శోభారాణి



అమ్మవారికి పవిత్రాలతో పూజలు చేస్తున్న వేదపండితులు, అర్చకులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

డాబాగార్డెన్స్:

నాలుగు రోజులుగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహనం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. దేవస్థానం వేదపండితులు, అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రేపు ఆలయం మూసివేత..

ఈ నెల 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 నుంచి మరుసటి రోజు (8వ తేదీ) ఉదయం 7 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్టు ఈవో శోభారాణి తెలిపారు. అలాగే దర్శనాలు నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. గ్రహణానంతరం సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ నిర్వహించి, అమ్మవారికి 5 గంటల ప్రాత:కాల పంచామృతాభిషేకం అనంతరం ఉదయం 7 గంటల నుంచి దర్శనాలకు అనుమతించనున్నట్టు చెప్పారు. భక్తులు గమనించాలని ఈవో శోభారాణి కోరారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మధురవాడ: విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మధురవాడ పీహెచ్‌సీ, వాంబేకాలనీ యూపీహెచ్‌సీలను సందర్శించారు. ఆయా ఆరోగ్య కేంద్రాలలో సేవలు, ఈహెచ్ఆర్, డయాగ్నోస్టిక్ సేవలు, మందులు తదితర వాటి గురించి వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వాంబేకాలనీలో ఇద్దరు స్టాఫ్ నర్స్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కరే అందుబాటులో ఉన్నట్టు గుర్తించామన్నారు. పైగా కొంతమంది సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దుర్గాలమ్మ ఆలయానికి రూ.50 వేల ఏసీ అందజేత

కుమారుడితో కలిసి అమ్మవారికి సమర్పించిన వాసుపల్లి గణేష్‌కుమార్



ఆలయ నిర్వాహకులకు కుమారుడు సాకేత్ చేతుల మీదుగా ఎయిర్ కండీషన్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: వెలంపేటలో వేంచేసిన దుర్గాలమ్మ ఆలయానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం రూ.50 వేలు విలువ చేసే ఏసీ బహూకరించారు. పార్టీ శ్రేణులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులకు రెండు టన్నుల సామర్థ్యం కలిగిన సాంసంగ్ ఎయిర్ కండిషన్‌ను వాసుపల్లి కుమారుడు సాకేత్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వాసుపల్లి మీడియాతో మాట్లాడుతూ దుర్గాలమ్మ ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని కోరుకుంటూ పూజలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరాధ్య దైవం దుర్గాలమ్మను నమ్మిన భక్తులకు వరాలిచ్చే శాంత రూపంలో, దుర్బుద్ధితో చూసేవారికి ఉగ్రరూపంలో దర్శనం ఇస్తారన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేశానని తెలిపారు. ఆ చల్లని తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.